# ఈతరం పిల్లలు

**పండక్కి కొత్త బట్టలు కొనడానికి షాపింగ్ వెళ్ళాలన్న ఆలోచనతో పనంతా తొందరగా పూర్తిచేసి శాంతమ్మ కోసం ఎదురు చూస్తూ కూర్చుంది ఇందిర. ఈమెది, శాంతమ్మది పక్క పక్క ఇళ్లే. వాళ్ళమ్మాయి క్కూడా డ్రెస్ కొంటానంటే ఇద్దరూ కలిసి వెళుతున్నారు.**

వాళ్లమ్మాయి శ్రావణి, ఇందిర కూతురు పల్లవి చిన్నతనం నుంచి మంచి స్నేహితులు. ఒకే స్కూలు. ఇద్దరు ఒకే కాలేజీ కూడా. శ్రావణి వాళ్ళ నాన్న ఇందిర భర్త మాదిరి గుమాస్తా కాదు, పెద్ద ఆఫీసరు. చిన్నతనం నుంచి కలిసే తిరిగారు కాబట్టి పిల్లల్లో పేద, ధనిక తారతమ్యాలు లేవు. ఇప్పటికీ కలిసే కాలేజీకి వెళ్తారు. కానీ డబ్బుతో వచ్చిన హుందాతనం ఆ పిల్ల మీద స్పష్టంగా కనిపిస్తుంది. చెప్పొద్దుగానీ పల్లవి ఆణి ముత్యం. పాత డ్రెస్సు వేసుకున్నా శ్రావణికన్నా అందంగానే ఉంటుంది. తల్లులిద్దరూ వయసు పై బడిన వాళ్లు. జీవితంలోని ఒడిదుడుకులు తెలిసినవాళ్ళు, కనుక డబ్బుకన్నా ఆప్యాయతలకే ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. ఇరుగు పొరుగు వారే అయినా ఒకరి కష్ట సుఖాలు మరొకరికి బాగా తెలుసు. ఇప్పటికైతే ఏ అరమరికలు లేకుండా ఒకే కుటుంబంలా కలిసి మెలిసి ఉంటున్నారు.

ఆలోచనల్లోనే శాంతమ్మ వచ్చేసింది. మరో పది హేను నిమిషాల్లో ఇద్దరూ కాఫీ తాగి షాపింగ్‌కి బయల్దేరారు.

మంచి వెరైటీలు, ఫ్యాషన్ డిజైనింగ్ డ్రెస్సులు... చూడటానికి చాలా బాగున్నాయి. కానీ, ఒక్కో డ్రెస్సు ధర ఆకాశాన్నంటుతోంది!

'వదినా! ఈకలరు డిజైన్ చాలా బాగుంది. మన శ్రావణికి నప్పుతుంది. పైగా రేటు కూడా తక్కువే. చూడు ఎలా ఉందో' అంటూ ఇందిర తన చేతిలోని డ్రెస్‌ను శాంతమ్మకి చూపింది.

'అవునొదినా! చాలా బాగుంది. కానీ, ఇంత తక్కువ ఖరీదు డ్రెస్ తీసుకుంటే అది ఊరుకుం టుందా? తోటి వాళ్ళ వదుమ వెళ్తే నామోషీగా ఉంటుందని నా మీద ఎగిరి పడుతుంది. దాని తత్వం నీకు తెలుసు కదా! అదెప్పుడూ అయిదు వందలకి తక్కువ ఏ డ్రెస్సు వేసుకోదు. ఈ తరం పిల్లలు చెబితే వింటారా...' అంటూ ఆరు వందల డ్రెస్సు సెలెక్టు చేసింది శాంతమ్మ.

నిజమే వాళ్లు ఉన్నవాళ్ళు. అంత తక్కువ ఖరీదులో ఎలా కొంటుంది. ఈ సారి పల్లవికి మంచి డ్రెస్ తీసుకోవాలి. దానికెప్పుడూ రెండు వందల్లోనే తీసుకుంటాను. ఈ మధ్య తరగతి జీవితాలకి, ఆర్థిక ఇబ్బందులు ఎటూ తప్పవు. అది ముచ్చటపడి ఏదీ అడగదు. తెచ్చింది తీసు కుంటుంది. పల్లవి కూడా శ్రావణి తోటి పిల్లే కదా! దానికి మాత్రం ఖరీదైన గుడ్డలు వేసుకొని తిరగాలన్న కోరిక ఉండదా ఏమిటి? అడగలేదు కదా అని దాని సరదాలని గుర్తించకపోతే ఎలా? అనుకుని ఇందిర తన చీర డబ్బులు కూడా కలిపి అయిదు వందల డ్రెస్ తీసుకొని, దాని కళ్లలో మెరిసే ఆనందపు మెరుపుని చూడాలని ఆత్రంతో ఇంటికి వచ్చింది.

'పల్లవీ! ఈ డ్రెస్ చూడు, ఎంత బావుందో! ఇది వేసుకుంటే నీవు బంగారు బొమ్మలా ఉంటావు. తెలుసా!' అంటూ కవర్లోంచి డ్రెస్ తీసి ఇచ్చింది.

'చాలా బావుంది మమ్మీ! ఎంత?' అనడిగింది డ్రెస్సింగ్ టేబుల్ ముందు నిలబడి అటూ ఇటూ వేసుకొని చూస్తూ...

'అయిదు వందలు' చెప్పింది ఇందిర. కూతురు సంబరాన్ని చూసి ముచ్చట పడుతూ.

'ఏమిటీ? అయిదు వందలే!...' ఆశ్చర్యంతో కళ్లు పెద్దవి చేస్తూ 'మరి నీకో...' అనడిగింది.

'నీవు కాలేజీకి వెళ్తున్నావుకదమ్మా ఖరీదైన గుడ్డలు లేకపోతే నామోషీగా ఉండదూ? అందుకే ఈ సారి నేను చీర కొనుక్కోకుండా ఆ డబ్బు కూడా కలిపి నీకు డ్రెస్ తెచ్చాను' అంది కుర్చీలో కూర్చుని అలసట తీర్చుకుంటూ

అంతే! ఆమె మాటలకి పల్లవి అంతెత్తున ఎగిరిపడింది. 'కాలేజీకి వెళ్లినంత మాత్రాన ఖరీదైన గుడ్డలు వేసుకోవాలని రూలేమీ లేదే! కాలేజీకి వెళ్ళేది చదువుకోవడానికి గానీ ఫ్యాషన్ ప్రదర్శనలివ్వడానికి కాదు. ఎవరి తాహతుకి తగ్గట్టు వారు నడుచుకుంటారు. దానికి నామోషీ ఎందుకు? పేద, ధనిక అనే తేడా డబ్బుతో వస్తుందేమో గానీ గౌరవం, హోదా అనేవి వ్యక్తిత్వాన్ని బట్టే, వ్యక్తిలోని ప్రతిభని బట్టీ వస్తాయి. అంతే గానీ, ఖరీదైన దుస్తులు వేసుకుంటే రావు. ఆధునికత అనేది మనిషి ఆలోచనల్లో రావాలి గానీ వేషధారణలో కాదు.' అంటూ చెప్పుకుపోతున్న పల్లవిని చూస్తుంటే ఆ భావాలను. అర్థం చేసుకోలేక పోయినందుకు మనిషిగా ఆమె సిగ్గు పడింది.

పల్లవి ఆలోచనా సరళిని చూసి తల్లిగా గర్వప డింది.

నిజమే! ఈతరం పిల్లల మనో భావాల్ని అర్థంచే సుకోవటం కష్టమే మరి.

—మాసుపత్రి ఉషాకిరణ్,

